ప్రజా సంక్షేమమే జగన్ అజెండా

- డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు
- పెదఅమిరంలో మూడో రోజు గడపగడపకు మన ప్రభుత్వం



పెదఅమిరంలో లబ్ధిదారులకు సంక్షేమ పథకాల బ్రోచర్ అందిస్తున్న డీసీసీబీ చైర్మన్ పీవీఎల్

కాళ్ల: రాష్ట్ర ప్రజల సంక్షేమమే అజెండాగా పరిపాలన చేస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అందరూ అండగా నిలవాలని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు కోరారు. పెదఅమిరం గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమం గురువారం మూడో రోజు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా సంక్షేమ పథకాలు పొందుతున్న మహిళలంతా పీవీఎల్ నరసింహారాజుకు ఘన స్వాగతం పలికి హారతులు పట్టారు. ఈ సందర్భంగా ఆయన ప్రతి ఇంటికి వెళ్లి సంక్షేమ పథకాల అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. కుటుంబాల వారీగా అందుతున్న లబ్ధిని వారికి వివరించి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని ఆశీర్వదించాలని కోరారు. సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రతి కుటుంబం ఎంతో ఆనందంగా ఉందన్నారు. సంక్షేమ పథకాలు పొందుతూ ప్రతి కుటుంబం ఆర్థికంగా అభివృద్ధి చెందుతుందని చెప్పారు. పేదల పక్షపాతి అయిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేసుకోవాలని కోరారు. వైఎస్ జగన్ మళ్లీ ముఖ్యమంత్రి అయితే రాష్ట్రంలో పేదరికం ఉండదన్నారు. సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా పరిపాలన చేస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలవాలని పిలుపునిచ్చారు. అధికారంలో ఉన్నప్పుడు ఏమీ చేయలేకపోయారని, ఇప్పుడు మళ్లీ అధికారం కోసం అబద్ధపు హామీలు ఇస్తున్నారని అసహనం వ్యక్తం చేశారు. గత టీడీపీ పాలనలో ప్రజలకు మేలు జరిగిందో, వైఎస్ జగన్ పాలనలో మేలు జరిగిందో ప్రజలు గ్రహించాలన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పాలనలో పాఠశాలలను కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్ది విద్యార్థులకు ఉన్నతమైన విద్యను అందిస్తున్నారని అన్నారు. అంతేకాకుండా ఏ ఒక్క విద్యార్థి ఆర్థిక ఇబ్బందుల వల్ల చదువు ఆగకూడదనే సంకల్పంతో విద్యార్థుల తల్లుల పేరా అనేక సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు చెప్పారు. వసతి దీవెన, విద్యా దీవెన, అమ్మ ఒడి వంటి అనేక సంక్షేమ పథకాలతో విద్యార్థులకు అండగా నిలుస్తున్నారని స్పష్టం చేశారు. నిత్యం పేదల కోసం ఆలోచించే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల చెంతకే పరిపాలన తీసుకువచ్చారని తెలియజేశారు. ఎటువంటి అవినీతికి తావు లేకుండా రాజకీయాలకు అతీతంగా ప్రతి ఒక్కరికి అర్హత ప్రామాణికంగా సంక్షేమ ఫలాలు అందుతున్నాయని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రజల ఆశీస్సులు తప్పకుండా జగన్‌మోహన్‌రెడ్డి ఉంటాయని స్పష్టం చేశారు. దేశంలో ఏ రాష్ట్రంలో జరగని విధంగా రాష్ట్రంలో సంక్షేమ పథకాలతో పాటు రాష్ట్ర అభివృద్ధి చేస్తున్నారని చెప్పారు. పెదఅమిరం గ్రామంలో ఇప్పటికే అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తుండటంతో పాటు గ్రామ అభివృద్ధి జరుగుతోందన్నారు. నియోజకవర్గంలో అన్ని గ్రామాలలో అభివృద్ధి పథంలో నడిపిస్తున్నట్లు స్పష్టం చేశారు. పెదఅమిరం గ్రామంలో ఇప్పటికే సీసీ రహదారులు, సీసీ డ్రెయిన్లు నిర్మించినట్లు చెప్పారు. రానున్న రోజుల్లో రూ.40 లక్షలతో చర్చి రోడ్‌తో పాటు పలు రహదారుల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని స్పష్టం చేశారు. అదేవిధంగా రానున్న ఎన్నికల్లో నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ జెండా ఎగురవేసేందుకు నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ డొక్కు సోమేశ్వరరావు, కోపల్లె సొసైటీ అధ్యక్షుడు వేగేశ్న జయరామకృష్ణంరాజు, మండల పార్టీ అధ్యక్షుడు గణేశ్న రాంబాబు, జవ్వాది సత్యనారాయణ, బిరుదుగడ్డ గంగాధర్, బిరుదుగడ్డ రమేష్, సరాబు ముఖేష్, కాటిక ఆనందరాజు, పెనుమత్స రంగరాజు, బొత్స అచ్చారావు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌ల ద్వారా సత్వర న్యాయం


మాట్లాడుతున్న న్యాయవాది బంటుమిల్లి సురేష్

ఆకివీడు: సత్వర న్యాయం కోసం లోక్ అదాలత్‌లను సద్వినియోగం చేసుకోవాలని, సెప్టెంబర్ 9న జరుగనున్న లోక్ అదాలత్‌ను వినియోగించుకుని సత్వర న్యాయం పొందాలని న్యాయ సేవాధికార సంస్థ ప్యానల్ లాయర్ బంటుమిల్లి సురేష్ పిలుపునిచ్చారు. మండలంలోని దుంగపడప గ్రామ సచివాలయం వద్ద గురువారం చట్టాలపై అవగాహనా కార్యక్రమం జరిగింది. ఆయన మాట్లాడుతూ వలంటీర్లు ప్రజలకు లోక్అదాలత్‌ల గురించి వివరించాలన్నారు. చిన్న చిన్న సమస్యల్ని గ్రామ స్థాయిలో పరిష్కరించుకోవాలన్నారు. కోర్టులో ఉన్న సివిల్ కేసులు, మనోవర్తి, మోటార్ వెహికల్, ప్రమాద బీమా, ఇతర పెండింగ్ కేసులు, చెక్ బౌన్సు కేసులు, రాజీ చేసుకోదలచినవారు ఆర్జీ రూపంలో సంప్రదించి పరిష్కరించుకోవాలని సూచించారు. న్యాయవాదులు బీ.లోకేశ్వరరావు, ఎస్ఐ ఫణిమోహన్, పారా లీగల్ వలంటీర్ కృపావరం, సర్పంచ్ ఎం.విశ్వేశ్వరరావు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.



క్లుప్తంగా

మావుళ్లమ్మకు బంగారం సమర్పణ

భీమవరం (ప్రకాశంచౌక్): భీమవరం పట్టణ ఇలవేల్పు శ్రీమావుళ్లమ్మవారికి రాజమండ్రికి చెందిన మంగిన గోపాలకృష్ణ దంపతులు 8 గ్రాముల బంగారం సమర్పించారు. అదే విధంగా కాళ్ల మండలం కోపల్లెకు చెందిన బి.వరలక్ష్మి 4 గ్రాముల బంగారం అమ్మవారికి సమర్పించారు. వారికి ఆలయ సిబ్బంది అమ్మవారి ప్రసాదం, రసీదును అందచేశారు. ఆలయ ఈఓ, సహాయ కమిషనర్ యర్రంశెట్టి భద్రాజీ, ధర్మకర్త తాళ్లపూడి భాగ్యలక్ష్మి, పాల్గొన్నారు.

స్థలం పరిశీలించిన జేసీ


ఎన్నార్పీ అగ్రహారంలో స్థల పరిశీలన చేస్తున్న జేసీ రామ్‌సుందర్‌రెడ్డి

ఉండి: తూనికలు, కొలతలు జిల్లా కార్యాలయం, ప్రయోగశాల భవన నిర్మాణం నిమిత్తం ఎన్నార్పీ అగ్రహారంలోని పౌరసరఫరాల శాఖ గోదాముల వద్ద స్థలాన్ని జేసీ ఎస్.రామసుందర్‌రెడ్డి గురువారం పరిశీలించారు. ఇక్కడ అందుబాటులో ఉన్న తొమ్మిది సెంట్ల భూమిని పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. స్థలం మ్యాపులను, భూమిని, పరిసరాలను పరిశీలించారు. ఇన్‌చార్జి తహసీల్దార్ ఎస్వీఎస్ నాయుడు, తూనికలు, కొలతల శాఖాధికారి నాగరాజారావు పాల్గొన్నారు.

గాదిరాజుకు మద్దతుగా నేడు భారీ ర్యాలీ


మాట్లాడుతున్న పాతపాటి శ్రీనివాసరాజు

కాళ్ల: వైఎస్సార్ సీపీ కోసం శ్రమించిన నేతలకు పార్టీలో సముచిత స్థానం దక్కుతుందని రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ పాతపాటి శ్రీనివాసరాజు (వాసు) అన్నారు. పెదమిరం పార్టీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ ఏర్పడినప్పటి నుంచి పార్టీ అభివృద్ధి కోసం అహర్నిశలు శ్రమించిన వ్యక్తి గాదిరాజు వెంకట సుబ్బరాజును సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గుర్తించి ప్రతిష్టాత్మకమైన టీటీడీ బోర్డు సభ్యులుగా ఎంపిక చేయడం అభినందనీయమన్నారు. క్షత్రియుల్ని గుర్తించి ప్రత్యేక స్థానం ఇస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా ఉంటామని స్పష్టం చేశారు. తిరుపతిలో టీటీడీ బోర్డు సభ్యులుగా గాదిరాజు వెంకట సుబ్బరాజు ప్రమాణ స్వీకారం చేసి తిరిగివస్తున్న సందర్భంగా శుక్రవారం ఉదయం తొమ్మిది గంటలకు ఆకివీడు ఉప్పుటేరు నుంచి ఉండి మీదుగా మందలపర్రు వరకు భారీ ర్యాలీ నిర్వహిస్తున్నామన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, క్షత్రియులు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు. ఈ సమావేశంలో నాయకులు పెనుమత్స దుర్గాప్రసాదరాజు పలువురు పాల్గొన్నారు.

ఘనంగా రాఖీ పండుగ

ఆకివీడు: పరమాత్మ దృష్టిలో అందరూ సోదరీ సోదరులేనని బ్రహ్మకుమారీ విశాలక్షి అన్నారు. స్థానిక ఆశ్రమం ఆధ్వర్యంలో రాఖీ పండుగ సందర్భంగా ప్రతి ఒక్కరికీ రాఖీ కట్టారు. రాఖీ పౌర్ణమి అందరికీ శాంతి ప్రసాదించాలని ఆమె ఆకాంక్షించారు. ఆశ్రమం నిర్వాహకులు నేరెళ్ల చినబాబు, స్థానికులు అల్లాడి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆకివీడులో పారిశుద్ధ్యం మెరుగుకు చర్యలు


సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ జామి హైమావతి

ఆకివీడు: ప్రజారోగ్య విభాగానికి అధిక ప్రాధాన్యతనిస్తూ పారిశుద్ధ్యం మెరుగునకు చర్యలు చేపడుతున్నట్లు నగర పంచాయతీ చైర్‌పర్సన్ జామి హైమావతి చెప్పారు. స్థానిక నగర పంచాయతీ సర్వసభ్య సమావేశం గురువారం చైర్‌పర్సన్ హైమావతి అధ్యక్షతన జరిగింది. సమావేశంలో ఆమె మాట్లాడుతూ డంపింగ్ యార్డు సమస్య తీవ్రంగా ఉందన్నారు. స్థానిక సిద్ధాపురం రోడ్డులోని వంతెన వద్ద ఖాళీ ప్రదేశంలో గత కొన్నేళ్లుగా చెత్త డంపింగ్ చేస్తున్నారని చెప్పారు. ఇక్కడ వ్యర్థాలు పేరుకుపోయి రోడ్డు పైకి చేరడంతో ప్రజలకు ఇబ్బందికరంగా మారిందన్నారు. దీనిని ఎప్పటికప్పుడు తొలగిస్తున్నప్పటికీ పట్టణంలో పెరుగుతున్న చెత్తకు సరిపడే స్థలం లేకపోవడంతో ఇబ్బందికరంగా ఉందన్నారు. ప్రభుత్వ పోరంబోకు స్థలం కోసం ప్రయత్నాలు చేస్తున్నామని చెప్పారు. పట్టణంలోని ఆయా సచివాలయాల్లో తగినంత సిబ్బంది లేరని, ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లతామని హైమావతి చెప్పారు. పట్టణంలో పారిశుద్ధ్యం మెరుగునకు ప్రస్తుతం ఉన్న సిబ్బందితో పనులు చేయిస్తున్నామని తెలిపారు. పలు వార్డుల్లోని సమస్యల్ని సమావేశం దృష్టికి కౌన్సిలర్లు తీసుకువచ్చారు. అనంతరం అజెండాలోని అంశాల్ని సమావేశం ఆమోదించింది. కమిషనర్ జీ.కృష్ణమోహన్, వైస్ చైర్మన్లు పుప్పాల పండు, వంగా జ్యోత్స్న, చీఫ్ విప్ పడాల శ్రీనివాసరెడ్డి, కౌన్సిలర్లు కట్టా రవి, కటికతల జాన్‌వెస్లీ, జిల్లా పెద్దిరాజు, మోటుపల్లి కుమారి, తిమ్మారెడ్డి మాధవి, అప్ర పున్నీసా బేగం, గేదల అప్పారావు, దొడ్డి జగదీష్, నిమ్మల నాగు, కోఆప్షన్ సభ్యులు ఎండీ జక్కీ, గుండుగొలను సావిత్రి పాల్గొన్నారు.

భూమి, ఆధార్ సీడింగ్ వేగిరపర్చండి

భీమవరం (ప్రకాశంచౌక్): ప్రతి రైతుకు తమ పంట భూమి, ఆధార్‌తో అనుసంధానం పూర్తి చేసి పీఎం కిసాన్ లబ్ధి చేకూర్చాలని జేసీ ఎస్.రామ్‌సుందర్‌రెడ్డి వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. గురువారం తన చాంబర్‌లో వ్యవసాయ శాఖ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి రైతుకు పంట భూమి, ఆధార్‌తో అనుసంధానం చేయించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జేడీఏ జడ్.వెంకటేశ్వర రావు, అధికారులు పాల్గొన్నారు.

మొగల్లును సందర్శించిన కేంద్ర బృందం

పాలకోడేరు: కేంద్ర ప్రభుత్వంలోని వివిధ శాఖల సహాయ అధికారుల బృందం గురువారం మొగల్లును సందర్శించారు. పంచాయతీ కార్యదర్శి, వైద్య ఆరోగ్య సిబ్బంది, అంగన్వాడీ కార్యకర్తలను కలిసి వివిధ అంశాలను తెలుసుకున్నారు. కుటుంబ నియంత్రణ, 108, 104 సర్వీసుల నిర్వహణ, కేంద్ర పథకాలు అమలుపై సమీక్షించారు. శిక్షణలో భాగంగా తాము ఈ వివరాలు తెలుసుకుంటున్నట్లు బృందంలోని బాసుదేవ్ యాదవ్, హేమంత్ కుమార్ మీనా, హిమాన్షు సైనీ, మయాంక్ అగర్వాల్, నిషిత్ ఇండోరా, విశాల్ చెప్పారు. అధికారులు బృందానికి ఈఓపీఆర్‌డీ ఎం.నవీన్ కిరణ్ నోడల్ అధికారిగా వ్యవహరించారు.

‘గడపగడపకు’ నిధులతో గ్రామాల అభివృద్ధి


సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించి పరిశీలిస్తున్న సర్పంచ్ చినకృష్ణమూర్తి


ఉండి: ప్రజాసమస్యల పరిష్కారం, సంక్షేమ పథకాలపై అవగాహనకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా గ్రామాలు అభివృద్ధిపథంలో నడుస్తున్నాయని యండగండి గ్రామ సర్పంచ్ గోగులమండ చినకృష్ణమూర్తి అన్నారు. గురువారం గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం నిధులు, జెడ్పీ నిధులు రూ.28 లక్షలతో ఎస్సీ ఏరియాలో నిర్మాణం చేపట్టిన సీసీ రోడ్డు పనులను ఆయన ప్రారంభించి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గడపగడపలో గుర్తించిన సమస్యలను ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరించుకుంటున్నామన్నారు. కార్యక్రమం పూర్తయిన కొద్దిరోజులకే రూ.20 లక్షలు నిధులు సంబందిత సచివాలయానికి అందుతున్నాయన్నారు. వీటి ద్వారా గ్రామంలో అవసరమైన ప్రాంతాల్లో సీసీ రోడ్లు, డ్రెయిన్లు వంటివి నిర్మిస్తున్నామన్నారు. వార్డు సభ్యులు, సచివాలయ అధికారులు పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువులపై దృష్టి పెట్టాలి

ఆకివీడు: సేంద్రియ ఎరువులపై రైతులు దృష్టి పెట్టాలని ఏడీఏ కె.శ్రీనివాసరావు అన్నారు. కుప్పనపూడిలో పొలంబడి కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు అధికంగా పురుగుమందులు వినియోగిస్తే నష్టం తప్ప ఉపయోగంలేదన్నారు. ఏఓ ఎమ్మార్సీ ప్రియాంక మాట్లాడుతూ వేప కషాయంతో శత్రుపురుగులు నాశనం అవుతాయని చెప్పారు. కషాయం తయారీ విధానాన్ని రైతులకు స్వయంగా తెలియజేశారు. వేప కషాయం ఉపయోగాల్ని వివరించారు. ఈ కార్యక్రమంలో రైతులు నంద్యాల చల్లారావు, ఎస్టీపీ రాఘవాచార్యులు, చోడాబత్తుల శ్రీను, వీఏఏ లావణ్య, చందు పాల్గొన్నారు.

వైభవంగా అమ్మవారి జాతర

ఉండి: ఎన్నార్పీ అగ్రహారంలో జలసిద్ధి వినాయక యువజన, గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో మహంకాళమ్మ అమ్మవారి శ్రావణమాస లక్ష్మీవారాల జాతర మహోత్సవాలను వైభవంగా నిర్వహించారు. గురువారం గ్రామంలోని బీసీ కాలనీలోని ఆలయం నుంచి ప్రారంభమైన జాతర ఊరేగింపు మహంకాళమ్మ అలయానికి చేరుకుంది. అమ్మవారికి నైవేద్యాలు, చలివిడి పానకాలు సమర్పించారు. ఉత్సవ కమిటీ అధ్యక్షుడు మంతెన సత్యనారాయణ, అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు చీర రమేష్, గలావిల్లి ధనుంజయ, మాజీ సర్పంచ్ మునుకోలు సింహాచలం, బురిడి వాసుదేవరావు పాల్గొన్నారు.



సీఎస్ఆర్ నిధులతో అభివృద్ధికి సహకరించాలి


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ పి.ప్రశాంతి

భీమవరం(ప్రకాశంచౌక్): పుట్టి పెరిగిన గ్రామానికి సీఎస్ఆర్ నిధులతో అభివృద్ధి పనులు చేసి ప్రజల మన్నన పొందాలని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో సీఎస్ఆర్ (కార్పొరేటు సోషల్ రెస్పాన్స్) నిధుల వినియోగంపై పారిశ్రామిక, ఆక్వా రైతులు, సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. గత ఏడాది సీఎస్ఆర్ నిధులతో ఆశించినంతగా పనులు జరగలేదన్నారు. ఆదాయంలో 2 శాతం సీఎస్ఆర్ కింద అభివృద్ధి కార్యక్రమాలు తప్పనిసరిగా చేయాలన్నారు. గేల్స్ అథారిటీ వారికి ఈ ఏడాది రూ.1.30 కోట్లు కింద పనులు చేపట్టాలని ప్రతిపాదనలు పంపించామన్నారు. ఆంధ్రా సుగర్స్ రూ.10 లక్షలు, వాన్ బెర్రీ కంపెనీ రూ.1 లక్ష నిధులను సీఎస్ఆర్ కింద డిపాజిట్ చేశారన్నారు. ఓఎన్జీసీకి రూ.70 లక్షలు, వసుధ ఫౌండేషన్ స్కూల్ అభివృద్ధికి రూ.60 లక్షలతో ప్రతిపాదనలు పంపించామన్నారు. జిల్లా అభివృద్ధికి ఉత్సాహంగా ముందుకు రావాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. జిల్లా పరిశ్రమల శాఖ అధికారి ఉయ్యాల ఆదిశేషు, డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ టీ త్రినాథరావు, పొల్యూ షన్ బోర్డ్ ఈఈ కె.వెంకటేశ్వరరావు, సీపీఓ కె.శ్రీనివాసరావు, డీఎంహెచ్‌ఓ డాక్టర్ డి.మహేశ్వరరావు, డీఈఓ ఆర్.వెంకటరమణ, లేబర్ కమిషనరు ఎ.లక్ష్మి, మునిసిపల్ కమిషనర్ ఎం.శ్యామల పాల్గొన్నారు.

తొలగించిన ప్రతి ఓటునూ మళ్లీ పరిశీలిస్తాం

భీమవరం (ప్రకాశంచౌక్): జిల్లాలో తొలగించిన ప్రతి ఓటును పరిశీలిస్తామని కలెక్టర్ పి.ప్రశాంతి చెప్పారు. గురువారం కలెక్టరేట్‌లో స్పెషల్ సమ్మరీ రివిజన్ - 2024లో భాగంగా చేపట్టిన ఇంటింటి సర్వేపై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. ఇంటింటి సర్వే ఈనెల 21న పూర్తయిందని, అలాగే క్షేత్రస్థాయిలో బీఎల్‌ఓలు ఇంటింటికి వెళ్లి క్లెయిమ్స్ పరిశీలన చేశారన్నారు. సెప్టెంబర్ 1 నుంచి నిర్వహించే రేషనలైజేషన్ ప్రక్రియలో రాజకీయ పార్టీ ప్రతినిధులు సహకరించాలన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు జిల్లాలో జనవరి 6, 2022 తేదీ నుంచి ఆగస్టు 31, 2023వ తేదీ వరకు వచ్చిన డెత్, షిఫ్టింగ్ కేసులు అన్ని రీవెరిఫికేషన్ చేస్తున్నామని, దీనిపై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నాయకులకు అవగాహన ఉండాలని, వారి బూత్ లెవెల్ ఏజెంట్‌లకు ఈ విషయమై అవగాహన కల్పించాలని సూచించారు. వెరిఫికేషన్ కోసం నియోజకవర్గానికి ఒక స్పెషల్ ఆఫీసర్‌ని నియమిస్తామన్నారు. డిలీషన్ విషయమై ఫార్మాట్-ఏ నోటీస్ ఇచ్చి డిలీట్ చేయడం జరుగుతుందని, షిఫ్టింగ్ కేసు విషయమై బీఎల్‌ఓలు క్లారిటీగా ఉండాలని తెలియజేశామన్నారు. జిల్లాలో 14,42,253 మంది ఓటర్లు ఉండగా, డోర్ టు డోర్ సర్వేలో 14,41,479 ఓటర్లను వెరిఫికేషన్ చేశామన్నారు. వైఎస్సార్ సీపీ ప్రతినిధి కామన నాగేశ్వరరావు మాట్లాడుతూ భీమవరం నియోజకవర్గంలోని కొన్ని ప్రాంతాలలో సుమారు నాలుగువేల డూప్లికేట్ ఓటర్లను గుర్తించి సంబంధిత ప్రూఫ్‌లతో ఆర్డీవో దృష్టికి తీసుకురావడం జరిగిందన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ దీనిపై పరిశీలించి వచ్చే వారంలో రిపోర్ట్ అందజేస్తామన్నారు. జేసీ ఎస్.రామ్‌సుందర్‌రెడ్డి, డీఆర్వో కె.కృష్ణవేణి, రాజకీయ నాయకులు ఎం.శ్యాంబాబు (టీడీపీ), బీహెచ్ శ్రీనివాస్‌వర్మ (బీజేపీ), కాటూరి కరుణాకర్ (బీఎస్పీ) పాల్గొన్నారు.





